క్లుప్తంగా

నేడు ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభం


బి.ఎస్.పేటలో నూతనంగా నిర్మించిన ఆలయం

మాకవరపాలెం: నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయాన్ని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఆదివారం ప్రారంభించనున్నారు. బీఎస్‌పేటలో రూ.10 లక్షల టీటీడీ నిధులతో ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈ నేపథ్యంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. దీనికి ఎమ్మెల్యే హాజరై ఆలయాన్ని ప్రారంభిస్తారని పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ పాశపు నాగేశ్వరరావు తెలిపారు.

రూ.10 లక్షలతో డ్రైనేజీ పనులు


డ్రైనేజీ పనులు చేస్తున్న దృశ్యం

గొలుగొండ: పాకలపాడులో ప్రజలకు ఇబ్బందులు లేకుండా డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తున్నట్టు ఎంపీటీసీ సభ్యురాలు యాళ్ల లక్ష్మీదుర్గా తెలిపారు. ఇక్కడ డ్రైనేజీ సమస్యను జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు దృష్టికి తీసుకెళ్లగా రూ.10 లక్షల మంజూరు చేశారన్నారు. ఈ నిధులో డ్రైనేజీ పనులు చేయడం వల్ల గ్రామంలో శాశ్వతంగా డ్రైనేజీ సమస్య పరిష్కారం కానుందన్నారు.

రామాలయం అభివృద్ధికి భూమిపూజ


భూమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

రావికమతం: కొత్తకోటలో జీర్ణోద్ధరణకు చేరుకున్న గ్రుడ్డివారి రామ మందిరం పునర్నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. వందేళ్ల క్రితం నిర్మించిన ఈ ఆలయం పెచ్చులూడి పడుతున్నాయి. పునర్నిర్మాణానికి 50 మందితో పలు కుటుంబాల యువకులు ఒక కమిటీగా ఏర్పడ్డారు. ఈ మేరకు విరాళాలు సేకరించారు. కళ్యాణ మండపంతోపాటు నూతన ఆలయం నిర్మించాలని సంకల్పించి భూమిపూజ చేశారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ గిరిబాబు

గొలుగొండ: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంగా చదివి మంచి భవిష్యత్‌ను ఎంచుకోవాలని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు తెలిపారు. శనివారం చీడిగుమ్మల జెడ్పీ హైస్కూలు వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. వీటిని ఉపయోగించుకుని బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎంపీటీసీ లెక్కల అప్పలనాయుడు, సర్పంచ్ కాపారప చిన్నబ్బాయి పాల్గొన్నారు.

నేషనల్ బాక్సింగ్ పోటీలకు నలుగురు క్రీడాకారులు


బాక్సింగ్ క్రీడాకారులకు ప్రోత్సాహక నగదు అందజేస్తున్న డైరెక్టర్లు

నర్సీపట్నం: నింజాస్ అకాడమీ నుంచి నలుగురు బాక్సింగ్ క్రీడాకారులు జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటున్నారు. బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈ నెల 11 నుంచి 17 వరకు బెంగళూరులో నిర్వహిస్తున్న బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటున్న బొంతు మౌనిక, బొమ్మల రాజేశ్వరి, చికిరి మణికుమార్, ఉలం రవికుమార్‌లను అకాడమీ డైరెక్టర్లు వెలగా నారాయణరావు, బోశం శివ, సీనియర్ కోచ్ యర్రా శేఖర్ అభినందించి, వారికి కొంత నగదు అందజేశారు.


దేవరాపల్లి పీహెచ్‌సీ నుంచి నూతన ఎంపీడీవో భవనానికి నిర్మించిన సీసీ రోడ్డు


ఆధునికీకరించిన దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్

ప్రారంభోత్సవాల పండగ

- దేవరాపల్లిలో సంక్షేమంతోపాటు రూ.92 కోట్లతో అభివృద్ధి
- పైలాన్ ఆవిష్కరణకు హాజరు కానున్న డిప్యూటీ సీఎం బూడి
- రూ.1.70 కోట్లతో పీహెచ్‌సీ అదనపు భవనానికి శంకుస్థాపన నేడు

దేవరాపల్లి: చరిత్రలో కనీవినీ ఎరగని రీతిలో దేవరాపల్లి అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. దశాబ్దాలుగా కనిపించని ప్రగతి సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలోనే సాక్షాత్కరించింది. రూ. 92.09 కోట్లతో సంక్షేమంతోపాటు అభివృద్ధి పనులు చేపట్టి ఇక్కడ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. వీటిలో రూ. 46.32 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు, వివిధ సంక్షేమ పథకాలతో ప్రత్యక్ష, పరోక్షంగా రూ.45.76 కోట్ల మేర వెచ్చించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మతో కలిసి ప్రధాన రోడ్లను విస్తరించడంతోపాటు ఇంటింటి కుళాయిలు, ప్రతీ వీధిలోను సీసీరోడ్లు, డ్రైనేజీలు, సామాజిక భవనాలు సహా ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చారు. గత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గ్రామంలోని మట్టి రోడ్లన్నీ తారురోడ్లుగా నిర్మించి


దేవరాపల్లిలో అధునాతన హంగులతో నూతనంగా నిర్మించిన ఎంపీడీవో భవనం

అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దారు. ప్రతిపక్ష నాయకులు సైతం మెచ్చుకునేలా అభివృద్ధి పనులు చేపట్టిన సీఎం జగన్‌కు, డిప్యూటీ సీఎం బూడికి స్థానికులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

రూ. 3.27 కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులు

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అధునాతన హంగులతో రూ. 2.67 కోట్లతో నిర్మించిన నూతన ఎంపీడీవో భవనాన్ని డిప్యూటీ సీఎం ఆదివారం ప్రారంభిస్తారు. రూ. 60 లక్షలతో ఆర్టీసీ కాంప్లెక్స్ సీసీ ప్లాట్‌ఫాం, సీఎంఆర్ సహకారంతో ఆధునికీకరించిన ఆర్టీసీ కాంప్లెక్స్ భవనాన్ని ప్రారంభోత్సవానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. దేవరాపల్లి పీహెచ్‌సీలో రూ. 1.70 కోట్లతో అదనపు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. రూ. 92.09 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన పైలాన్ ఆవిష్కరించనున్నారు.

భారీ బహిరంగ సభ నేడు...

రైవాడ అతిథి గృహం ఆవరణలో నిర్వహించే భారీ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు ప్రసంగిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. ముందుగా సినిమా థియేటర్ నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ భారీ ర్యాలీగా వచ్చి అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం చేస్తారని, అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారన్నారు.

ఇంతలా అభివృద్ధి చేస్తారని ఊహించలేదు



ప్రతీ వీధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. దేవరాపల్లి నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్లన్నీ తారురోడ్లుగా నిర్మించి రవాణా కష్టాలను తీర్చారు. మురుగుకూపంలా ఉండే ఆర్టీసీ కాంప్లెక్స్ అద్దంలా అభివృద్ధి చేశారు. ఇక్కడ చేసిన అభివృద్ధిని చూసి ఇతర గ్రామాల ప్రజలు గొప్పగా చెప్పుకోవడం ఎంతో ఆనందం కలిగిస్తోంది.

– కక్కల ఈశ్వరమ్మ, దేవరాపల్లి


ఆర్.వై.అగ్రహారంలో సచివాలయ భవనం ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి


సూర్రెడ్డిపాలెంలో సీసీ రోడ్డును జెడ్పీటీసీ అనురాధ, మహిళలతో కలిసి ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం


కె.సంతపాలెంలో మంచినీటి ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

69 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి పూర్వ విద్యార్థులు

నేడు తాండవలో ఆత్మీయ సమ్మేళనం


తాండవ హైస్కూల్

నాతవరం: తాండవ హైస్కూల్‌లో 69 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా కలుసుకోనున్నారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి సర్వం సిద్ధం చేశారు. 1965లో తాండవ రిజర్వాయరు నిర్మాణ సమయంలో ప్రభుత్వం పాఠశాల ఏర్పాటు చేసింది. ప్రాజెక్టు నిర్మాణానికి 300పైగా వివిధ పనులకు సంబంధించి ఉద్యోగు లు, వృత్తి పనివారు ఇక్కడే స్థిర నివాసం ఉండేవారు. వారి పిల్లలు చదువుకునేందుకు 50 కిలోమీటర్ల సమీపంలో పాఠశాలలు లేవు. దీంతో తాండవ ప్రాజెక్టు అధికారుల విజ్ఞప్తి మేరకు అప్పటి పాలకులు ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేశారు. మొదట్లో 7వ తరగతి వరకు, ఆ తర్వాత 1974లో పదో తరగతి వరకు హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. చుట్టు పక్కల 20 కిలోమీటర్ల మేర పాఠశాలలు లేకపోవడంతో కోటవురట్ల, కొయ్యూరు సమితి పరిధిలో 42 గ్రామాలకుపైగా తాండవ హైస్కూల్‌కు కీలకంగా ఉండేది. ఇక్కడ చదువుకున్న వారు అనేక మంది మావోయిస్టులుగా ఉన్నతాధికారులుగా పారిశ్రామిక వేత్తలు ప్రజాప్రతినిధులుగా ఉన్నత స్థాయిలో ఉన్నారు. దివంగత నేత కుడుముల రవి ఉమ్మడి రాష్ట్రంలో మావోయిస్టు రాష్ట్ర నాయకుడిగా కేంద్ర కమిటీ సభ్యుడిగా పని చేశారు. ఆయనతోపాటు చాలా మంది వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. ప్రస్తుతం ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైఎస్సార్‌సీపీ కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ ఇక్కడే చదువుకున్నారు. పాఠశాల ఏర్పాటు దగ్గర్నుంచి నేటి వరకు చదువుకున్న వారంతా ఆత్మీయ సమ్మేళనానికి విచ్చేస్తున్నారు.

ఉత్సాహంగా బాలోత్సవం

- వివిధ కళల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

నర్సీపట్నం: బాల బాలికలలో సృజనాత్మకతను వెలికితీసేందుకు అల్లూరి సీతారామరాజు బాలోత్సవం నిర్వహించామని బాలోత్సవం గౌరవాధ్యక్షుడు దస్త్రాల రాఘవేంద్రరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో బాలోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. విచిత్ర వేషధారణ, శాస్త్రీయ నృత్యం, దేశభక్తి గేయాలు, జానపద నృత్యం, ఏకపాత్రాభినయం, కోలాటం, ఫ్యాన్సీ డ్రెస్, రైమ్స్ పోటీలు నిర్వహించారు. సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో విద్యార్థులు కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. రాఘవేంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు కళల్లో రాణించాలన్నారు. ఈ పోటీ


ఏకపాత్రాభినయంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

ప్రపంచంలో అన్ని రంగాల్లో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. ప్రతిభను చాటుకునేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు రాఘవేంద్రరావు, అధ్యక్షులు డాక్టర్ అధికారి గోపాలరావు, కన్వీనర్ కె.త్రిమూర్తులరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాధవి, ఉపాధ్యాయులు, బాలోత్సవం నిర్వాహకులు పాల్గొన్నారు.

బీబీ పట్నంలో తాటాకు పాక దగ్ధం

- రూ.లక్ష మేర ఆస్తి నష్టం అంచనా

రోలుగుంట : బీబీ పట్నం గ్రామం శివారు రహదారిని ఆనుకొని ఉన్న తాటాకు పాకలో శుక్రవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన తాడి లక్ష్మికి చెందిన తాటాకు పాక దగ్ధం కావడంతో ఆమె పెంచుకుంటున్న కోళ్లు, ధాన్యం గింజలు, దుస్తులు, ఫర్నీచర్ అగ్నికి ఆహుతయ్యాయి. బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆమెకు ముగ్గురు కుమారులు. ఇద్దరికి వివాహం కాగా గ్రామంలో ఉన్న ఇళ్లు వారి నివాసానికి ఇచ్చేసింది. గ్రామం చివర రోడ్డు పక్కనే తాటాకు పాక నిర్మించుకొని మూడో కుమారుడితో కలిసి చిన్నపాటి వ్యవసాయం, కోళ్లు, గొర్రెలు, మేకలు పెంచుకుని జీవనోపాధి సాగిస్తుంది. శుక్రవారం రాత్రి అర్ధరాత్రి హఠాత్తుగా మంటలతో వేడి


కాలిపోయిన తాటాకు పాక

సెగలు రావడంతో వెంటనే లేచి గొర్రెలు, కొంత సామగ్రి బయటకు తరలించింది. అయితే మిగిలిన కోళ్లు, ధాన్యం, దుస్తులు, ఫర్నీచర్ కాలిపోయాయి. దీంతో సుమారు రూ. లక్ష ఆస్తి నష్టం జరిగిందని బాధితురాలు తెలిపింది. తాము నిద్రపోయిన తరువాత ఎవరో గిట్టని వారు పాకకు నిప్పు అంటించి ఈ ఘాతుకానికి పాల్పడి ఉండవచ్చని రోధించింది. ప్రభుత్వం వారు తనకు సాయం అందించి ఆదుకోవాలని ఆమె కోరారు.

పాదయాత్రకు స్పందన కరువు

చీడికాడ: మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత గవిరెడ్డి రామానాయుడు పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన కరువైంది. ఆయన తన స్వగ్రామం అప్పలరాజుపురంలో శనివారం ఉదయం పునః ప్రారంభించారు. ఈ పాదయాత్రలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.వి.జి కుమార్ పాల్గొన్నారు. అప్పలరాజుపురం నుంచి బి.సింగవరం, ఎల్.బి.పట్నం, ఖండివరం, వి.బి.పేట, శిరిజాం, కోనాం, మంచాల వరకు సాగింది. యాత్ర ప్రారంభంలో ఉన్న కార్యకర్తలు మధ్యాహ్నం ఖండివరంలో కనీసం కానరాలేదు.


ఖండివరం నందిబొమ్మ సెంటర్‌లో అరకొరగా జనాలు

ఈవీఎం ఓటింగ్‌పై అవగాహన


మహిళలకు ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఐ సతీష్

రావికమతం: ఈవీఎం మెషీన్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గానూ కొత్తకోట పోలింగ్ బూత్‌లో రెవెన్యూ అధికారులు శనివారం మాక్ ఓటింగ్ నిర్వహించారు. ఆర్‌ఐ సతీష్, వీఆర్వోలు, గ్రామ రెవెన్యూ సహాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌పై అవగాహన కల్పించారు. ఓటు ఎలా వేయాలి, తమకు నచ్చిన గుర్తుకు ఓటు వెళ్లిందా లేదా అనే విషయాలను వివరించడమే కాక ఓటర్ల సందేహాలను నివృత్తి చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన ర్యాలీ


సూచనలు చేస్తున్న ఎస్‌ఐ రామారావు

నాతవరం: రోడ్డు ప్రమాదాలు నివారించాలంటే ప్రయాణికులు కనీస జాగ్రత్తలు పాటించాలని ఎస్‌ఐ రామారావు తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా వెలుగు ఆధ్వర్యంలో స్థానిక మెయిన్‌రోడ్డు మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఏపీఎం మర్రి లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల నిమజ్జనోత్సవం

రోలుగుంట: గౌరీపరమేశ్వరుల నిమజ్జనంతో రోలుగుంటలో శనివారం ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. రథంపై గౌరీపరమేశ్వరులను స్థానిక కోనేరు వరకూ డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. అక్కడ పలు గ్రామాల భక్తులు అరటి పండ్లను విసురుతూ సందడి చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి చైర్మన్ పోతల లక్ష్మీ శ్రీనివాస్, మన్సిబ్ కుటుంబీకులు నిమజ్జనం చేశారు.

ప్రతి దళిత వాడను పంచాయతీ చేయాలి

- ఎయిమ్ వ్యవస్థాపకుడు, అడిషనల్ డీజీపీ సునీల్ కుమార్


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సునీల్‌కుమార్ తదితరులు

నక్కపల్లి/పాయకరావుపేట : రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి జనాభా దాటిన ప్రతి దళిత వాడను ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలని, అభివృద్ధి పనుల కోసం ఏటా రూ.2 కేటాయించాలని అంబేడ్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర వ్యవస్థాపకుడు, ఏపీ అడిషనల్ డీజీపీ(ఫైర్ సర్వీసెస్) పి.వి.సునీల్‌కుమార్ కోరారు. శనివారం పాయకరావుపేటలో అంబేడ్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో దళిత వాడ సాధన సంకల్ప సభ జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అడిషనల్ డీజీపీ సునీల్ కుమార్ ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశ జనాభాలో 20 శాతం దళితులున్నారన్నారు. వీరంతా తమను ఎంపీలను, ఎమ్మెల్యేలను, మంత్రులను చేయాలని కోరడం లేదన్నారు. దళిత వాడలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని, వెయ్యి జనాభా దాటిన ప్రతి దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసి అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కోసం ఏటా రూ.రెండు కోట్లు కేటాయించాలని కోరుతున్నారన్నారు.

విద్యుదాఘాత బాధితులకు పరిహారం

రూ.13 లక్షల చెక్కులు అందించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


సూర్రెడ్డిపాలెంలో తులసీకి చెక్కును అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


చంద్రయ్యపేటలో మృతుల భార్యలు లక్ష్మి, భారతిలకు చెక్కును అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

కె.కోటపాడు: విద్యుత్తుఘాతానికి గురై మృతి చెందిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.13 లక్షల పరిహారం మంజూరైంది. ఈ మొత్తాన్ని సూర్రెడ్డిపాలెం గ్రామానికి చెందిన మృతుడు ఈర్లె మహేష్, చంద్రయ్యపేట గ్రామానికి చెందిన గవిరెడ్డి ఎర్రునాయుడు, బోకం సురేష్ కుటుంబాలకు చెక్కుల రూపంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అందజేశారు. గతేడాది ఈర్లె మహేష్ విద్యుత్ షాక్‌తో మృతిచెందగా, చంద్రయ్యపేటకు చెందిన యువకులు గవిరెడ్డి ఎర్రునాయుడు, సురేష్ గత నెల భోగి పండగ రోజున స్వాగత కటౌట్లు కడుతూ విద్యుత్ ప్రమాదానికి గురై చనిపోయారు. ముగ్గురు మృతులకు చిన్న పిల్లలు ఉన్నారు. వీరి కుటుంబాల పరిస్థితిని తెలుసుకున్న డిప్యూటీ సీఎం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారు. ఈ మేరకు సూర్రెడ్డిపాలెంలో మహేష్ భార్య తులసీకి రూ.3 లక్షలు, చంద్రయ్యపేటలో మృతులు ఎర్రునాయుడు, సురేష్‌ల భార్యలు లక్ష్మి, భారతిలకు రూ.5 లక్షల చొప్పున చెక్కులను అందించారు. మృతుల పిల్లలు చిన్నవారు కావడంతో రెసిడెన్షియల్ పాఠశాలల్లో సీట్లును మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీలు ఈర్లె అనురాధ, కర్రి సత్యం, సర్పంచ్ సబ్బవరపు పార్వతి, వైస్ ఎంపీపీలు రొంగలి సూర్యనారాయణ, లెక్కల గోపి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు పాల్గొన్నారు.

హుషారుగా జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పందెం

బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేటలో రామాలయ తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇక్కడ రామాలయంలో పార్టీలకు అతీతంగా తమ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి సీతారామాంజనేయ విగ్రహాలు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ మహోత్సవం సందర్భంగా రామాలయం వీధిలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో అమ్మాయిలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల ముగ్గులు వేశారు. సాయంత్రం గ్రామ శివారులో జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పందేలు ఆకట్టుకున్నాయి. దీంతోపాటు ముగ్గుల పోటీల్లో విజేతలకు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు బహుమతులు ప్రదానం చేశారు. వడ్డాది, మంగళాపురం, కుముదాంపేట, అప్పలరాజుపురం, దిబ్బిపాలెం, దండిసురవరం తదితర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి తీర్థ మహోత్సవంలో పాల్గొన్నారు. రాత్రికి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భజనలతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్ని అలరించాయి.

13న జిల్లా స్థాయి గుర్రపుందాలు

మాడుగుల రూరల్: ఈ నెల 13న కె.జె.పురం–మాడుగుల దబ్బకుంట రహదారిలో మసమ్మ తల్లి తీర్థం ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఇందులో భాగంగా 101 ఘటాలతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం నుంచి ఆలయం వద్ద భారీ స్థాయిలో అన్నసమారాధన ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం జిల్లా స్థాయి గుర్రప్పందాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన వాటికి రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ. 4 వేలు, రూ.3 వేల చొప్పున అందజేస్తామన్నారు. కబడ్డీ, ఎడ్ల బళ్ల పరుగు పోటీలు నిర్వహిస్తామన్నారు.


పేటలో మహిళలు వేసిన ముగ్గులు

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మాకవరపాలెం: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ అన్నారు. ఎంపీపీ అధ్యక్షతన శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.55 లక్షల ఆర్‌డబ్ల్యూ ఎస్, పంచాయతీరాజ్ నిధులతో గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ భవనాలను నిర్మించామన్నారు. ప్రతి గ్రామానికి జల్‌జీవన్ మిషన్ పథకంలో ఇంటి కుళాయిలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం విద్య, వైద్యం, రెవెన్యూ, వ్యవసాయంతోపాటు ఇతర శాఖల వారీ గా అధికారులు ప్రగతి నివేదికల ను చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు రుత్తల లక్ష్మి, రాజారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణ

ప్రభుత్వ కార్యాలయాలకు కుర్చీల వితరణ

కె.కోటపాడు: గొండుపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వంటాకు నాయుడు తన సొంత నిధులతో స్థానిక గ్రామ సచివాలయం, ఆర్బీకే, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలకు కుర్చీలను వితరణగా ఇచ్చాడు. మొత్తం 30 కుర్చీలను రూ.18 వేలతో కొనుగోలు చేశాడు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుతో కలిసి శనివారం ఆయా కార్యాలయాల సిబ్బందికి అందించారు. దాత నాయుడును డిప్యూటీ సీఎం అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ, మాజీ సర్పంచ్ బండారు రామస్వామిపాత్రుడు పాల్గొన్నారు.


కుర్చీలను అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి, దాత నాయుడు

కేజేపురంలో ఉచిత పశు వైద్య శిబిరం

మాడుగుల రూరల్: సుమోటో ఫైనాన్స్ గ్రూపు ఇండియా సౌజన్యంతో శనివారం కేజేపురంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ వి. చిట్టినాయుడు హాజరై పాడి రైతులుకు పశుగ్రాసం పెంపకం, కిసాన్ క్రెడిట్ కార్డు, రుణాలపై అవగాహన కల్పించారు. అనంతరం 34 పశువులకు గర్భకోశ పరీక్షలు, 28 పశువులకు నట్టలనివారణ, 42 పశువులకు పేడ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జామి రమణబాబు, పాలకేంద్రం అధ్యక్షుడు ఎల్లపు శ్రీను, పశువైద్యాధికారులు గణేష్, ల్యాబ్ టెక్నీషియన్ కుమారి, 1962 అంబులెన్స్ వైద్యాధికారి శైలేంద్ర పాల్గొన్నారు.


పశువులను పరీక్షిస్తున్న ఏడీ చిట్టినాయుడు